నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ

- మీకోసం, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా, మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సరఫరా పైపులైన్ పనులకు శంఖుస్థాపన

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కావలి వైకుంఠపురం పెదపవనిరోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద 15వ ఆర్థిక సంఘం నిదులు కింద రూ.23.50లక్షల అచంనాతో చేపట్టనున్న తాగునీటి సరఫరా పైపులైన్ పనులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ నూనత పైపులైన్ వల్ల 31, 35, 36, 38 వార్డుల ప్రజలకు నీటిసరఫరా మరింత మెరుగుపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. తాగునీటి ఇక్కట్లు తొలగిస్తున్నందుకు ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, మున్సిపల్ కమిషనర్ శ్రావన్‌కుమార్, డిప్యూటీ ఈఈ పి.సాయిరాం, ఏఈ టి.వినోద్‌కుమార్, మున్సిపల్ స్వర్ణ వార్డుల సిబ్బంది ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ రవాణాకు అడ్డుకట్ట

దగదర్తి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ మాలేపాటి రవీంద్ర నాయుడు అభ్యర్థన మేరకు కావలి ఆర్డీవో శ్రీవంశీకృష్ణ ఆదేశానుసారం ఆదివారం అధికారులు అక్రమ గ్రావెల్‌పై దండయాత్ర నిర్వహించారు. కావలి సీఐ, దగదర్తి ఎస్సై, ఇరిగేషన్ ఏఈ, దగదర్తి ఎమ్మార్వో, తిరువీధి పాడు గ్రామ వీఆర్వో తదితర అధికార యంత్రాంగం దగదర్తి మండల తిరువీధిపాడు గ్రామంలో అక్రమ గ్రావెల్ రవాణా జరుగుతున్న క్వారీని పరిశీలించడం జరిగింది. మైనింగ్ పర్మిషన్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను మాలేపాటి రవీంద్రనాయుడు కోరారు. ప్రభుత్వ అనుమతి లేకుండా చేస్తున్న అక్రమ గ్రావెల్ రవాణాను పూర్తి స్థాయిలో అరికడతామని, ఈ దందాలో ఎంతటి వారు ఉన్నా కఠినంగా శిక్షిస్తామని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

బుచ్చి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం డిఎల్ఎన్ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో సబ్ జూనియర్స్ బాలబాలికల షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ క్రీడా ఎంపికలకు సుమారు 100 మంది క్రీడాకారులు రాష్ట్రా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరిగింది. ఇక్కడ ఎంపికక కాబడిన క్రీడాకారులు 14,15 తేదిలలో పలనాడు జిల్లాలో జరుగు సబ్ జూనియర్ షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నెల్లూరు షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య తెలియజేశారు. ఈకార్యక్రమంలో భరత్,వినోద్, హరయ్య, ప్రదీప్, మల్లికార్జున రావు, శ్రీదేవి, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన, 3కే వాక్

- పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : క్యాన్సర్‌పై అవగాహన పెంచుతూ ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలపై చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో కావలి పట్టణంలో మెడికవర్ హాస్పిటల్ 3కే వాక్ కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ , కావలి ఐఎంఏ, సేవియర్స్ వాలంటరీ ఆర్గనైజేషన్, నలంద విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాన్సర్ అవగాహన ర్యాలీ భారీగా జరిగింది. ఈ ర్యాలీలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు నడిపించారు. కావలి ఆర్డీవో కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ 3కే వాక్, విట్స్ కాలేజీ శాప్ గ్రౌండ్ వరకు కొనసాగింది. వైద్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ , నెల్లూరు ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ స్థాయిలో క్యాన్సర్ అవగాహన వాకథాన్తో పాటు ప్రజలతో ప్రత్యక్ష అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వైద్య నిపుణులు, భారత్‌లో ప్రతి సంవత్సరం 14 లక్షలకు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, వీటిలో అధిక శాతం కేసులు ఆలస్యంగా గుర్తించడం వల్ల ప్రాణాపాయం జరుగుతోందని తెలిపారు. అయితే సమయానికి పరీక్షలు చేయించుకుంటే, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను పూర్తిగా నియంత్రించవచ్చని స్పష్టం చేశారు. డాక్టర్ జి.రంగ రమణ్, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ ఆట్లాడుతూ ఆధునిక కీమోథెరపి, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలతో క్యాన్సర్ ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయి. అయినప్పటికి అవగాహన, ప్రారంభ దశలో నిర్ధారణే ప్రధాన ఆయుధం, లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. డాక్టర్ ఎం.రమేష్ బాబు, సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మాట్లాడుతూ ప్రారంభ దశలో గుర్తించిన క్యాన్సర్‌ను శస్త్ర చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు. ముఖ్యంగా 40 ఏళ్ల పైబడిన వారు బ్రెస్ట్, ఒరల్ సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ శ్రవణ్ కుమార్‌రెడ్డి వి, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ఉన్న భయాన్ని, అపోహలను తొలగించడమే మా లక్ష్యం. అవగాహన సమయానికి వైద్య సలహా తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ను జయించవచ్చు అన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి 2831 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 69.834టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 300, పెన్నా డెల్టా 1400, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 1400క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం99.465మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

ఘనంగా మూలస్థానేశ్వర ఆలయ నూతన పాకలమండలి ప్రమాణస్వీకారోత్సవం

- సమీష్టి కృషితో నూతన కమిటీ భక్తులకు సేవలు అందించాలి
- ఆగమ శాస్త్ర విధానాల్లో దేవాదాయశాఖ అధికారులు జోక్యం చేసుకోవద్దు
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయరెడ్డి వెల్లడి



నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త-విద్య : ఆదివారం నగరంలోని స్థానిక మూలాపేటలో వెలసియున్న శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్‌శాఖమంత్రి పొంగూరు నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పోరేషన్ ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌లు పాల్గొని నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతు నూతన పాలక మండలిని మంత్రి నారాయణ సూచనలతో ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. నూతన పాలక మండలిలో చైర్మన్‌గా ఎంపికైన పుట్టా అజయ్, మిగిలిన సభ్యులు దేవస్థాన పవిత్రత, భక్తుల మనోభావాలు కాపాడేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయ్యాలన్నారు. శైవక్షేత్రాల్లో నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంకు ప్రత్యేక స్థానం ఉందని ఆలయ చరిత్రను అందరికి తెలిసేలా చేయ్యాలని కోరారు. రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇంబ్బందులు కలుగకుండా నూతన కమిటీ సమీష్టి కృషితో రాణించాలని కోరారు. అలాగే ఆగమశాస్త్ర విధానల్లో దేవాదాయశాఖ అధికారులు జోక్యవ చేసుకోవద్దన్నారు. ఆగమ పండితులు, అర్చక స్వాముల సలహాలు, సూచనలతో సిబ్బంది ముందుగు వెళ్లి ఆలయ పవిత్రలను కాపాడాలన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతు ఈనెల 15 నుండి జరుగనున్న మహాశివరాత్రి బ్రహోత్సవాలకు అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేయ్యాలని అదికారులను ఆదేశించారు. గతంలో 2018లో తాను మంత్రిగా ఉన్నప్పుడు ఆలయ కోనేరు అభివృద్ధికి రూ.6.80 కోట్లు మంజూరుచేశామని, గుర్తుచేశారు. నూతన కమిటీకిఆయన శుభాకాంక్షలు తెపారు. మంత్రి ఆనం సహకారంతో నగరంలోని అన్నీ దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని దేవాలయాల అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. తోలుత మంత్రులు, నాయకులు ఆలయంలోని మూలస్థానేశ్వరుని దర్శిం చి ప్రత్యేక పూజలు గావించారు. మంత్రులకు ఆల య వేద పండితులు, అర్చక స్వాములు పూర్ణ కుంభంతో ఘనస్వాతగం పలికారు. అనంతరం మూలస్థానేశ్వరుని బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ముఖ్యఅతిథులు ఆవిష్కరించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో మంత్రి నారాయణ మార్క్ అభివృద్ధి

- ప్రజల చెంతకే రూ.2లకే 20 లీటర్ల స్వచ్ఛజలం
- జూన్ నాటికి దోమల నుండి విముక్తికి పక్కా ప్రణాళికతో ముందడుగు
- 50 కోట్లతో డ్రైనేజీ ప్రక్షాళన - గత ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తిన మంత్రి నారాయణ
- 39వ డివిజన్ మూలపేట, 13వ డివిజన్లో యలమవారిదిన్నెలో ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి

నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నగర అభివృద్ధికి మంత్రి నారాయణ పక్కా ప్రణాళికతో ముందుకు దూసుకెళ్తున్నారు. 39వ డివిజన్ మూలపేట, 13వ డివిజన్ యాలమవారి దిన్నెలో ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వాటర్ ప్లాంట్స్ కోసం వెచ్చించిన 2.60 కోట్ల ప్రజాధనం వృధా అయిందన్నారు. నిలిచిపోయిన 60 ప్లాంట్లను పునరుద్ధరిస్తున్నామని ప్రకటించారు. ఇప్పటికే 26 ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయని, పేదలకు కేవలం 2 రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. నగరంలో 50 కోట్లతో డ్రైనేజీ పనులను జూన్ నాటికి పూర్తి చేసి దోమల నుండి విముక్తి కలిగిస్తానన్నారు. ఆ వెంటనే నాణ్యమైన రోడ్ల నిర్మాణం చేపడతామని హామీఇచ్చారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా 15 పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేస్తున్నామన్నారు. నెల్లూరును పర్యావరణ హిత నగరంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నగర అభివృద్ధిలో భాగంగా ప్రజలందరూ ఇంటింటికి డ్రైనేజీ కనెక్షన్లు తీసుకుని భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, 39వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి అన్నంగి ప్రసాద్, ప్రెసిడెంట్ మనోహర్, వైస్ ప్రెసిడెంట్ మురళి మోహన్, జనరల్ సెక్రటరీ గౌతమ్ మధురెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.

గంజాయి సమాచారం ఇవ్వు.. గిఫ్టు పట్టు

- వివరాలు గోప్యంగా
- రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : యువతను తప్పుదోవలో పయనింపజేస్తున్న గంజాయికి సంబంధించిన అమ్మకాలు, నిల్వలు ఎక్కడైనా ఉంటే సమాచారమిస్తే అటువంటి వారికి పోలీస్ శాఖ ద్వారా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేకమైన గిఫ్టు ఇవ్వడం జరుగుతుందని రూరల్ డీఎస్పీ జి. శ్రీనివాసరావు అన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బావి భవిష్యత్తును అంధకారం చేసుకోరాదని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి ఫ్రీ జిల్లాగా తయారయ్యేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు గానీ, ఎక్కడైనా ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 112కు, ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 14446, 1933కు సమాచారం ఇస్తే అటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. మహిళలకు సంబంధించిన ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 109కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఈ మత్తు పదార్థాలపై జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో పోలీస్ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇటువంటి మత్తు పదార్థాలకు బానిసలైతే వారి జీవితమే అంధకారం అవుతుందన్నారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

సీతారామపురం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త ఉదయగిరి సిఐ వెంకట్రావ్ వేదింపుల కారణంగా సీతారామపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ నల్లిపోగు జ్యోతి ఆదివారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాలుపడింది. ఈఘటనను గమనించి తోటి సిబ్బంది ఇంచార్జి ఎస్ఐ శ్రీనివాసులుకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వింజమూరులోని ఒ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించడంతో ప్రాణాపాయ స్థితినుండి బయటపడింది. అనంతరం బాధితురాలు స్థానిక విలేఖర్లతో మాట్లాడుతు ఉదయగిరి సిఐ వెంకట్రావ్ తనపై తప్పుడు ఆరోఫణలు, వ్యక్తిగత దూషణలు ,నిందలు వేస్తు నిరంతరం వేదింపులకు గురి చేస్తుండేవాడని చెప్పారు. గతంలో సీతారామపురం ఎస్ఐగా పనిచేస్తు సస్పెండ్ అయిన ఎస్ఐ శివకృష్ణారెడ్డితో తనకు అక్రమ సంబంధం ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తు ఎస్ఐ శివకృష్ణారెడ్డి సస్పెన్షన్ రిపోర్టులో పొందుపరచారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మెడికల్ లివ్ ఇవ్వాలని ధరఖాస్తు అర్జీ రూపంలో కోరినా స్పందించకపోగా ఇటీవల తనకు కుదిరిన పెళ్ళి సంబంధం కూడా అక్రమ సంబంధం ఆరోపణలతో చెడగొట్టాడని బావోద్యాగానికి లోనైంది. గత మూడు రోజుల నుండి సిఐటి కలిసి తనపై వచ్చిన ఆరోపణల గురించి చర్చించేందుకు ప్రయత్నాలు చేసి సిఐ అనుమతి ఇవ్వకపోవడంతో మానస్తాపానికి గురై ఆత్మహత్యకు పాలు పడ్డానని బాధితురాలు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై పూర్తి విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

మూలపేట బాలికల హైస్కూల్‌కు కార్పొరేట్ హంగులు

- పది కోట్ల సీఎస్ ఆర్ నిధులతో డీఎస్ ఆర్ గ్రూపు చేపట్టిన పనులను పరిశీలించిన మంత్రి నారాయణ
- నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి
- జూన్‌లో ప్రారంభోత్సవానికి ముస్తాబు

నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త-వైద్యం నెల్లూరు నగరంలో ప్రభుత్వ విద్యారంగం రూపురేఖలు మారుతున్నాయి. మూలపేట ప్రాంత విద్యార్థినులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించాలనే లక్ష్యంతో డీఎస్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో నిర్మితమవుతున్న బాలికల నున్నత పాఠశాల నూతన భవన పనులను రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ స్వయంగా పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియతిరిగిన మంత్రి, పనుల వేగం, క్వాలిటీ పట్ల తన పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా, అత్యంత ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న ఈ భవనాన్ని రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి, అంటే జూన్ కల్లా పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు చదువుతో పాటు ఆటాపాటలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకున్నామన్నారు. గడువులోగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కృషితో పాటు డీఎస్ఆర్ ఫౌండేషన్ వంటి సంస్థల సేవా దృక్పథంతో తోడవ్వడం వల్ల మూలపేట స్కూల్ జిల్లాలోనే ఒక మోడల్ స్కూల్‌గా నిలవబోతోందన్నారు. కమీషనర్ నందన్, ఇన్‌చార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ తాళ్ళపాక అనురాధ, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

16.70 కోట్లతో వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులు

- 18 నెలల్లో పూర్తిచేసేందుకు కృషి
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త-విద్య ఆదివారం నగరంలోని స్థానిక మూలాపేట శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునఃనిర్మాణపనులను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణలు పరిశీలించారు. నిర్మాణ పనులు, డిజైన్‌లను పరిశీలించి దేవాదాయశాఖ అధికారులకు పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతు 16.70 కోట్ల రూపాయలతో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాన్ని పునఃనిర్మిస్తున్నామన్నారు. పూర్తిగా ఆగమశాస్త్ర నియమానుసారం , పండితులో చర్చించి ఈ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే వేగంగా పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆరునెలల క్రితం త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మదుగా ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ ఇప్పటికే ప్రధాన ఆలయంతోపాటూ నరసింహస్వామి ఆలయ ఫౌండేషన్ పనులు పూర్తిచేశామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ 18 నెలల్లో ఆలయ నిర్మాణం పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫౌండేషన్ పనులు పూర్తి అయ్యాయని, భక్తులకు సౌకర్యంగా, స్వామివార్ల ఉత్సవాల సమయంలో తోక్కిసలాటలు జరుగకుండా ఉండేందుకు ఆలయానికి నాలుగువైపుల విశాలమైన మాడవీధులను ఏర్పాటుచేయటం జరుగుతుందన్నారు. అనుకున్న సమయానికి శాస్త్రోక్తంగా మనులు పూర్తిచేస్తమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ ఈఓ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొండదిబ్బలో కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: నగరంలోని చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కొండ దిబ్బ ప్రాంతంలో ఆదివారం నగర ఏఎస్పి దీక్ష ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. స్థానికంగా ప్రతి ఇంటినీ పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రౌడీ షీటర్లు, అనుమానితుల ఇళ్ళను నిశితంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 500 మందికి పైగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల నుండి ఇక్కడ ఉంటూ నగరంలో వివిధ పనులు చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంలో భాగంగా నెల్లూరులో ఇటువంటి తనిఖీలు తరచూ చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో చిన్న బజార్, సంతపేట సిఐలు సిహెచ్ కోటేశ్వరరావు, వై వి సోమయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఎమ్మేల్యే కాకర్ల

కలిగిరి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కలిగిరి మండలం సిద్దన కొండూరులో ఉదయగిరి శాస నసభ్యులు కాకర్ల సురేష్ ఆదివారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సిద్దన కొండూరు గ్రామం నుండి సిద్దేశ్వర కొండ వరకు 96 లక్షల రోడ్డుకు శంకుస్థాపనచేశారు .ఈ రోడ్డు పూర్తి అయితే గ్రామం నుండి సిద్దన కొండూరు సిద్దేశ్వర కొండకు భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. అదే క్రమంలో సిద్దేశ్వర కొండ ప్రాంతంలో సుమారు 6 ఎకరాల్లో ఏడు లక్షల రూపాయాలతో నక్షత్ర వనం పేరుతో ఉద్యాన వనానికి ఎమ్మేల్యే చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం శివాలయంలో ఎమ్మేల్యే కాకర్ల సురేష్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ ధర్మకర్తలు ఎమ్మేల్యేకి తీర్ద ప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామంలోని సిసి రోడ్లకు 24 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మేల్యే మాట్లాడుతు గ్రామా లు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం,దేశం బాగుంటుందన్నారు. అదే విధంగా ప్రజలు కూడా సుఖ సంతోషాలతో ఎల్లవేళలా ఉండాలని తెలుగుదేశం పార్టీ ఆకాంక్ష అన్నారు. కూటమి పాలనలో గ్రామాలలో అన్ని సౌక ర్యాలు కలిగించి ప్రజలకు మంచి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారని త్వరలో పెద్దలతో మాట్లాడి ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం మండలంలోని చంద్రారెడ్డిపాళెం ,కుడుముల దిన్నెపాడు గ్రామాలలో ఏర్పాటు చేసిన సిసి రోడ్లకు ఎమ్మేల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎంఈఓ వెంకటసుబ్బయ్యకు అభినందనలు

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించి ఉన్నతాధికారులు సహఉద్యోగుల మన్ననలు పొంది గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్ల చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా కావలి రూరల్ మండల విద్యాశాఖాధికారి సిహెచ్.వెంకటసుబ్బయ్య అవార్డు అందుకొన్న శుభ సందర్భంగా ఆదివారం వైఎస్ఆర్ టిఏ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.మునీర్‌జాన్, రాష్ట్ర నాయకులు బి.వెంకటేశ్వర్లు జిల్లా నాయకులు భాస్కర్ నారాయణ, సాయిరెడ్డిలు దుశ్శాలవాలత ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

కార్మికులకు అండగా సిఐటియు జెండా ఆవిష్కరణ

మనుబోలు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : మనుబోలు రైల్వేస్టేషన్ సమీపాన ఫ్లైఓవర్ వద్ద ఆదివారం రైల్వే షెడ్డు కార్మికులు చుట్టుపక్కల గ్రామాల కార్మికులందరు సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈకాంక్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూగుల్ శ్రీనివాసులు జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కటికాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు కామ్రేడ్ దేవాదానం సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ ఆదిశేషయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంటు విషయాన్ని ప్రస్తావించండి

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : డిగ్రీ కళాశాలల ఫీజు రీయంబర్స్‌మెంటు మొత్తాన్ని ఒకేసారి చెల్లించేలా ప్రస్తావించాలని కోరుతూ స్థానిక డిగ్రీ కళాశాల అసోసియేషన్ ప్రతినిధులు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేయడం జరిగింది. తప్పక ఈ విషయమై మాట్లాడుతానని ఎమ్మెల్యే వారికి తెలి యజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, జోహార్‌భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యంనాయుడు, తదితర డిగ్రీ కళాశాలలకుచెందినవారు పాల్గొన్నారు.

కరెంటు నీళ్లు ఉంటే మోడల్ పట్టణంగా మారుతుంది

ఉదయగిరి, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : ఉదయగిరి పట్టణ శివార్లలో 2006-2007 సంవత్సరంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శాసనసభ్యులుగా ఉన్నప్పుడు ఉదయగిరి పట్టణంలో ఉన్న నిరుపేకుటుంబాలను గుర్తించి ఆదర్శ కాలనీ పేరుతో సుమారు 807 పై చిలుకు పట్టాలను మంజూరు చేశారు. విశాలమైన రోడ్లు, పాఠశాల కమ్యూనిటీ హాల్, గుడి మసీదు చర్చి వీటికి ప్రత్యేక స్థలం ఒక షాపింగ్ కాంప్లెక్స్ ఇలా మోడల్ కాలనీ అనే పేరుతో డిజైన్ చేసి నిరుపేదలకు పంపిణీ చేశారు. దాదాపుగా పట్టాలు పొందిన వారంతా ఏ పూటకు ఆ పూట కాయకష్టం చేసుకుని బతికే జనాలు కాబట్టి ఇల్లు విరమించుకోవడానికి ముందుకు రాలేకపోయారు. కారణం ఏమిటంటే మౌలిక వసతులైన రహదారి విద్యుత్, నీరు లేకపోవడమే అసలు కారణం. ఈ నేపథ్యంలో 167 బీజీ జాతీయ రహదారి ఈ మోడల్ కాలనీ ప్లాట్ల మధ్యలో నుంచి వెళ్ళింది. సుమారు 140 ప్లాట్లు హైవేలో కలిసిపోయాయి. కుటుంబ వ్యవస్థ ఏర్పడుతున్న కొద్ది ఉదయగిరి పాత ఊరిలో ఇల్లు నిర్మించుకునే స్థలం లేకపోవడంతో ప్రస్తుతం నిర్మాణాలకు అనుకూలంగా ఉన్న ప్రాంతం మోడల్ కాలనీ మాత్రమే. అయితే ఈ కాలనీని దృష్టిలో ఉంచుకుని పాలకులు, అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే ఒక అంధమైన నూతన గ్రామం ఈ ప్రాంతంలో రూపుదిద్దుకుంటుందని స్థానికులు అంటున్నారు. దారి నిర్మాణం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు సామాగ్రి తలలుచుకునే వెసులుబాటుతో పాటు ఖర్చు కూడా తగ్గుతుంది. నీటి వసతి ఖచ్చితంగా ఉండాలి కాబట్టి దానికి అనుసంధానంగా విద్యుత్ సౌకర్యం కూడా ఉండి తీరాలి. రోడ్లు, విద్యుత్, నీరు ఈ మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే సువిశాలమైన నూతన గ్రామం 167 బీజీ జాతీయ రహదారికి అటు ఇటు శరవేగంగా నిర్మాణాలు జరిగి రూపురేఖలు మారుతాయని ఈ విషయంపై స్థానిక శాసనసభ్యులు జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించాలని లబ్దిదారులు కోరుతున్నారు. హైవే రావటం వలన స్థానికంగా ఉన్న కొందరు అమాయకులపై వలవేసి అక్కడ ప్లాట్లు పెట్టిస్తామంటూ తక్కువలో కొనిస్తామంటూ కొంత గందరగోళ పరిస్థితులు సైతం సృష్టిస్తున్నారని ప్రభుత్వ మౌలిక వసతులు ఏర్పాటు చేసి గ్రామ నిర్మాణానికి సహకరించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

సత్యమతల్లికి వేడుకగా పాల పొంగళ్ళు

కలువాయి ఫిబ్రవరి 8ప్రభాతవార్త:మండలంలోని తోపుగుంట గ్రామంలో వెలసియున్న గ్రామ దేవత శ్రీ సత్యమ్మ తల్లికి ఆదివారం వేడుకగా పాలపొంగళ్ళను నిర్వహి ంచారు.వార్షికోత్సవంలో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేడుకలలో గ్రామంలో పండుగ వాతావరణంలో గ్రామస్తులందరు సామూహికంగా అమ్మవారికి పాలపొంగళ్ళు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి సన్నిధి నందు విశేష అలకంరణ నిర్వహించగా గ్రామం నుండి దూర ప్రాంతాలకు వెళ్ళిన ప్రతి ఒక్కరు గ్రామంలో చేరుకొని,భక్తిశ్రద్ధలతో నిర్వహి స్తారు. మద్యహ్నం పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ నిర్వహిం చారు.

మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్ధనలు

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : మన పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్ధనలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాల సమర్పించారు. అదే విధంగా ఆశ్రమ స్థల దాత పోనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాల సమర్పి ంచారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ ఆశయాల గురించి వివరి ంచారు. అనంతరం క్రమం తప్పకుండా ఆశ్రమానికి వచ్చే విద్యార్థులకు పరీక్ష అట్టలు కమిటీ సభ్యుల గంజల మంజుల అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం

నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త –వైద్యం : ఆదివారం విద్యుత్ భవన్ నందు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు, ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల నుండి నేరుగా సమస్యలను స్వీకరించి, వాటిని సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 8.30గంటల నుండి 9.30గంటల వరకు వినియోగదారులు 0861-2320427 రంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంగరంగ వైభవంగా గౌరి పూజా కార్యక్రమం

మనుబోలు ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : మనుబోలులోని చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న విశ్వనాద్‌స్వామి దేవస్థానం వద్ద మహాశివరాత్రికి నిర్వహించే కళ్యాణంలో భాగంగా ముందుగా గణపతి పూజ,గౌరి పూజ,విశ్వనాదస్వామి రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈకార్యక్రమంలో అదిక సంఖ్యలో మహిళలు పాల్గొని పసుపు దంచి గౌరి దేవిని పూజించారు.అనంతరం మద్యహ్నం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమం ఉభయదాతలుగా గూడూరు పెంచలయ్య,జ్యోతి, వ్యవహా రించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికి తీర్ద ప్రసాదాలు అందజేశారు.

అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

వింజమూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : వింజమూరు పట్టణంలో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అడుగులు వేస్తున్నారు. ఆదివారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద నుండి సుమారు కిలోమీటర్ మేర కోటి 17 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన స్థానిక ఎంపీపీ వనిపెంట హైమావతి స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ మురుగునీరు ఉండకుండా ఉండేందుకు రానున్న రోజుల్లో పట్టణంలో అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం నుడా నుండి 87లక్షలు ఎంపీపీ గ్రాంట్ నుండి 30 లక్షల రూపాయలతో ఈ డ్రైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. గడిచిన నాలుగు దశాబ్దాల నుండి ఇలాంటి సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆ సమస్య లేకుండా చూస్తానన్నారు. అంతే కాకుండా పట్టణ ప్రజల రవాణా సౌకర్యార్థం సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో పట్టణంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ అనుసంధాన రహదారులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అత్యాధునికమైన వసతులతో కూడిన డయాలసిస్ యూనిట్‌ను అందుబాటులో తీసుకురావడం జరిగిందన్నారు. దీని వల్ల కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా చికిత్స పొందే వీలు ఉంటుందన్నారు. వింజమూరు మండల విద్యా వైద్య రంగాలలో అభివృద్ధి చెందిందని ఇలాంటి పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనే తన లక్ష్యమని తన ప్రథమ ప్రాధాన్యత అని ఆయన తెలిపారు. గడిచిన 19 నెలల కాల వ్యవధిలో అనితర సాధ్యమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అంతే కాకుండా ఈ డ్రైవ్ నిర్మాణం పూర్తయిన వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం మెయిన్ రోడ్డు నుండి నేరేడుపల్లి వరకు గతంలో బీటీ రోడ్డుగా మంజూరు చేయడం జరిగిందని, దీనిని తిరిగి సీసీ రోడ్డుగా నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. స్థానిక బంగ్లా సెంటర్ నుండి బస్టాండ్ వరకు డివైడర్ ఏర్పాటు చేసి సెంటర్ లైటింగ్ పనులు చేయాల్సి ఉందన్నారు. అదే విధంగా వింజమూరు పాతూరు చెరువును ఆధునీకరణ చేసి సుందరంగా రూపుదిద్దుతామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట వెంకట సుబ్బారెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు మంచాల శ్రీనివాస్ నాయుడు, సర్పంచ్ ఎన్.సుజనా, బీజేపీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి వెంకట రంగారావు, జనసేన కోఆర్డినేటర్ కొట్టే వెంకటేశ్వర్లు, వింజమూరు బీజేపీ మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, నాయకులు చల్ల శ్రీనివాసులు యాదవ్, గురజాల గోపి, గోదూరు నాగిరెడ్డి, గని శ్రీనివాస నాయుడు, కర్ణం శ్రీనివాసులు నాయుడు, కాటం రమణారెడ్డి, పాములపాటి మాల్యాద్రి, దొరస్వామి నాయుడు, తిరుపతి ఆచారి, కంచర్ల శ్రీనివాసులు, ఏగినేని శ్రీనివాసులు, చేజర్ల భాస్కర్‌రెడ్డి, జయంత్‌రెడ్డి, షేక్ ఫీ, రేవునూరి రమణారెడ్డి, ఎన్నపల్లి పెంచలరావు, కేవీ రత్నం, షేక్ మస్తాన్‌బి, పంచల్ రెడ్డి, కటకం ప్రసన్న కుమార్, నీలం పెరుమాళ్ల రామకృష్ణ, రమణయ్య, మహేంద్ర, ప్రసాద్, డి.ప్రసాద్, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

టిఎన్‌టియుసి మండలాధ్యక్షుడుగా తిన్నెలపూడి సిద్ధయ్య

ముత్తుకూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : తెలుగు దేశం పార్టీలో అహర్నిశలు కృషి చేసి పార్టీ గెలుపుకు కారకులైన వారిని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఎప్పటి మరవలేరని అందుకు నిదర్శనంగా టిఎన్‌టియుసి మండల అధ్యక్షులుగా తిన్నెలపూడి సిద్ధయ్యను ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగిందని, అలాగే ఆయనతో పాటు నక్కా మోహన్ రావుతో పాటు ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసే కార్మికులకు ఎటువంటి సమస్యలు లేకుండా యాజమాన్యాలతో చర్చించి వారి కార్మిక సమస్యలను పరిష్కరించాలని కంపెనీల యాజమానాలను ఇబ్బంది పెట్టకుండా వారికి సహకరిస్తూ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనుబంధ కమిటీలు ఉత్సాహవంతులు ఎక్కువగా ఉన్నారని, అదే విధంగా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ నాయకులు పల్లికొండ శీనయ్య, ఎస్సీ సెల్ నాయకులు మాజీ ఎంపిపి నన్నం ధీనయ్య, నడవడి ముత్యం గౌడ్, సర్వేపల్లి ఐటిడిపి నాయకులు సతీష్ నాయుడు, అక్కయ్యగారి ఏడుకొండలు, నాగార్జున, గోనిల సిద్ధయ్య, సురేఖ, వడ్లమూడి వెంకటరమణయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో యువకుడి గల్లంతు

నెల్లూరు క్రైం, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : సరదాగా పెన్నానదిలో ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతైన సంఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని జొన్నవాడ కూడలి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరం సర్వేపల్లి కాలువకట్ట ప్రాంతానికి చెందిన గుణపాటి సంతోష్ కుమార్ స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి ఏడాది చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పెన్నానదిలో సరదాగా ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి జొన్నవాడ కూడలి వద్దకు చేరుకొని నదిలోకి దిగాడు. కొద్దిసేపటికి లోతు ఎక్కువ ఉన్న ప్రారంతంలోకి వెళ్లడంతో నదీ ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 8 గంటల వరకు యువకుడి ఆచూకి లభించలేదు.

పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ యుద్ధంకు సిద్ధం

కోట,ఫిభ్రవరి 8 ప్రభాతవార్త : రాష్ట్రలో పంచాయతీ ఎన్నికల నిర్వహాణకు ఎలక్షన్ కమీషన్ సిద్ధం అవుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమీషన్ శనివారం కీలక నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ మేరకు గ్రామ పంచాయతీల్లో వార్డు వారీగా ఫోటలోతో కూడిన ఓటర్ల జాబితా తయారు చేయాలని ఎలక్షన్ కమీషన్ జిల్లా పంచాయతీ అధికారులు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఓటరు జాబితాలను అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల జాబితా ఆధారంగా తీసుకుని సిద్ధం చేయాలని ఎలక్షన్ కమీషన్ స్పష్టం చేసింది. అలాగే పంచాయతీ ఎన్నికల్లో ఓటింగ్ పాల్గొనే ఓటర్లు జనవరి1. 2026 నాటికి ఓటరు అర్హత తేదీగా పరిగణించాలని పేర్కొంది. ఇలా సిద్ధం చేసిన ఓటరు జాబితాలను మార్చి 9. 2026న ప్రచరించనున్నారు.రాష్ట్రంలో మార్చి 3 తేదికీ పంచాయతీ పాలకవర్గాల గడువు తీరనుంది. గడువు తీరిన వెంటనే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎలక్షన్ కమీషన్ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధం ఉన్నట్లు స్పష్టం అవుతుంది.అయితే ప్రభుత్వం పంచాయతీ పాలకుల వర్గాల గడువు పూర్తి యిన వెంటనే ఎన్నికల నిర్వహించడానికి సిద్ధ పడుతుందా ? లేక మరి కొన్ని నెలల పాటు వాయిదా వేసి తరువాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లతుందో ! అనేది ఇప్పటి వరకు స్పష్టత లేదు.ఈ క్రమంలో ఎన్నికల కమీషన్ మాత్రం గడువు ముగిసిన వెంటనే ఎన్నికల నిర్వహించడానికి అన్ని సిద్ధం చేసుకొ ంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

గిరిజన విద్యార్థుల బాల సంస్కార కేంద్రాలు ద్వారా బాల మేళా

కోవూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ లో ఉన్న శ్రీ సచ్చిదానంద ఆశ్రమం నందు సింహపురి వైద్య సేవాసమితి జై భారత్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థుల బాల సంస్కార కేంద్రాలు ద్వారా బాల మేళా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి సింహపురి విద్య సేవా సమితి ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావు కొత్తూరు చిన్మయ మిషన్ స్కూల్ హరి స్వామి ముఖ్య అతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల బాల సంస్కార కేంద్రాల్లో శిక్షణ పొందిన విద్యార్థులు యోగ ఆసనాలు ప్రత్యేక కథలతో సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు, ముఖ్య అతిథులు పెద్దలు విద్యార్థులను అభినందించారు, ఈ సందర్భంగా సింహపురి వైద్య సేవ సమితి ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావు మాట్లాడుతూ గిరిజనులకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఒక లక్ష్యంతో జయభత్ ఆసుపత్రి వారు వైద్య కేంద్రాన్ని నిర్మించి హెల్త్ కార్డులు అందించడం జరిగిందన్నారు, గిరిజనలు బాలలు సమాజంలో సంస్కారవంతులు తయారయ్యేందుకు గిరిజన కాలనీలో బాల సంస్కార కేంద్రాలను రూపకల్పన చేయడం జరిగిందన్నారు, ఆత్మవిశ్వాసం పట్టుదల మీలో ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు,ఈ కార్యక్రమంలో పూడి ప్రసాద్ వ్యాపారవేత్త సందీప్ రుక్మిణి సిల్క్స్ అధినేత మురళి ఇనమడుగు ఆశ్రమం స్వామీజీ పురుషోత్తం స్వామీజీ సింహపురి వైద్య సేవ సమితి సభ్యులు సుధాకర్ సుబ్బారావు బాల సంస్కార కేంద్రాల మండల కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి గ్రామ పెద్దలు నల్లగట్ల శ్రీహరి కావేటి అశోక్ ,కనిశెట్టి మురళి బాల సంస్కార కేంద్రాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు...పనుల్లో చూపిస్తున్నాం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : దొంతాలిలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డినెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని దొంతాలి గ్రామంలో 40.80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు మరియు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే 2 కోట్ల 65 లక్షల రూపాయల నిధులను కేటాయించినట్లు చెప్పారు. దొంతాలి గ్రామంలో ఇంకా చేయాల్సిన అభివృద్ధి పనులు ఉన్నాయని, అవి కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు లేని సమయంలో గ్రామాలలో జెండాలు, అజెండాలు పక్కనపెట్టి అభివృద్ధిపైనే దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా ఎప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మల్లినేని వెంకయ్య నాయుడు, నెల్లూరు రూరల్ మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, జెడ్పీ కోప్షన్ మెంబర్ అలాబక్షు, టీడీపీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంఛార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, కో క్లస్టర్ ఇంఛార్జ్ రాపూరు శేఖర్, గ్రామ సర్పంచ్ మల్లినేని రత్నమ్మ, ఎంపీటీసీ చండి అరుణమ్మ, టీడీపీ నాయకులు చండి శంకరయ్య, చండి మురళి, రమణయ్య నాయుడు, రంగయ్య, కృష్ణయ్య, శ్రీహరి, అభిరామ్, వెంకటేశ్వర్లు, చండి సునీల్, బాలు వెం

గణనీయంగా పెరిగిన బోర్‌వెల్ మెటీరియల్ ధరలు

– పెరిగిన వ్యయభారంతో డ్రిల్లింగ్, ఫిట్టింగ్ చార్జీల పెంపు అనివార్యం

పొదలకూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : గతంలో ఎన్నడూ లేని విధంగా బోర్‌వెల్ డ్రిల్లింగ్‌కు ఉపయోగించే మెటీరియల్ ధరలు గణనీయంగా పెరగడంతో బోర్‌వెల్ యజమానులు, ఏజెంట్లు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డ్రిల్లింగ్ బిట్ల ధరలు మూడింతలుగా పెరగడం వల్ల బోర్‌వెల్స్ నిర్వహణ వ్యయం అమాంతం పెరిగిందని పొదలకూరు బోర్‌వెల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. 6.5 ఇంచుల డ్రిల్లింగ్ బిట్లు గతంలో రూ.22 వేల వరకు ఉండగా ప్రస్తుతం అవి రూ.62 వేల వరకు చేరాయని, అలాగే ఓబీ బిట్లు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకు పెరిగాయని వారు వివరించారు. ఈ పరిస్థితుల్లో బోర్‌వెల్స్ మెటీరియల్ కాస్ట్ గణనీయంగా పెరిగిందని, దీనికి అనుగుణంగానే డ్రిల్లింగ్, ఫిట్టింగ్ చార్జీలు వినియోగదారులు, రైతులకు తప్పనిసరిగా పెరగాల్సి వస్తోందని అసోసియేషన్ సభ్యులు కోవూరు బక్కయ్య నాయుడు, చొప్ప వెంకటేశ్వర్లు, మల్లినేని వెంకటేష్, మాదినేని రవి, దాసినేని ప్రసాద్, మాదినేని శంకరయ్య, కొమ్మి వేణు తెలిపారు. ఆదివారం స్థానిక ద్వారకామాయి కళ్యాణ మండపంలో వెంకటగిరి, గూడూరు, రాపూరు ప్రాంతాలకు చెందిన బోర్‌వెల్ యజమానులు, ఏజెంట్లతో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెరిగిన వ్యయాలను దృష్టిలో పెట్టుకొని రైతులు, వినియోగదారుల శ్రేయస్సును కూడా పరిగణనలోకి తీసుకుంటూ డ్రిల్లింగ్, ఫిట్టింగ్ చార్జీలను ఎంత మేర వసూలు చేయాలన్న అంశంపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ అమెరికా, చైనా దేశాల నుంచి దిగుమతి అవుతున్న డ్రిల్లింగ్ బిట్ల ధరలు మూడింతలుగా పెరగడం వల్ల బోర్‌వెల్ రంగం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. పెరిగిన ఖర్చులను భరించలేక పలుచోట్ల బోర్‌వెల్ బండ్లు నిలిచిపోయిన పరిస్థితి నెలకొందని తెలిపారు. దీనికి తోడు బోర్‌వెల్ మెటీరియల్ ఖర్చులు, లేబర్ చార్జీలు, హామర్స్ వ్యయం విపరీతంగా పెరిగాయని పేర్కొన్నారు. ఈ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని విధిలేని పరిస్థితుల్లో బోర్‌వెల్ డ్రిల్లింగ్ ధరలను పెంచాల్సి వస్తోందని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో (వెంకటగిరి) వెంకటరామయ్య, కోటి (గూడూరు) రాజు, రాజేష్, చింతలాత్మకూరు, నందకుమార్, కొండా రెడ్డి (రాపూరు) శీను పొదలకూరు ప్రాంతాలకు చెందిన బోర్‌వెల్ యజమానులు, ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం ఎస్సై వీరేంద్రబాబు

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలోని కోడూరు రహదారి మార్గంలో ఆదివారం ఎస్సై వీరేంద్రబాబు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహి ంచారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రహదారి ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటి తప్పనిసరి భద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటుచే సుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకపై ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎలాంటి సహనం చూపకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేకంగా కోడూరు బీచ్ ప్రాంతానికి వచ్చే వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, వేగ నియంత్రణ పాటించాలని కోరారు. ఈ తనిఖీల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్లు సహా అన్ని రకాల వాహనాలను సమగ్రంగా పరిశీలించారు. మద్యం మాత్రమే కాకుండా గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపినట్లయితే మరింత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై వీరేంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ఈనెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియూ మాజీ జిల్లా కార్యదర్శి ఎం. మోహన్‌రావు కోరారు. కావలి సిపిఐఎం కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్యవేధిక ఆధ్వర్యంలో స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకురాలు ఏ.ఆదిలక్ష్మి అధ్యక్షతన ఆదివారం సదస్సు జరిగింది. ఈసదస్సులో మోహన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు పోరాడి సాధించుకొన్న సమ్మెహక్కు యూనియన్ పెట్టుకునేటటువంటి హక్కు కనీస వేతనాలు, పిఎఫ్ఐ, ఈఎస్ఐ, గ్రాట్యూటి వంటి సౌకర్యాలు రద్దు అవుతాయని తెలిపారు. 29 కార్మిక చటాటలను తిరిగి పునర్దురించాలని నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికుల కడుపుకొట్టే జిరామ్‌జి పథకాన్ని రద్దు చేసి మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని తిరిగి పునరుద్దరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 12న కార్మిక సంఘాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సదస్సులో ఏఐఎఫ్‌టియు నాయకులు ఎల్.లక్ష్మిరెడ్డి, ఏఐటియుసి నాయకులు బొసు, న్యాయవాది కరవది భాస్కర్, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు పి.పెంచులయ్యలు ప్రసంగించి సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు ఎల్.శ్యామల, మున్సిపల్ వర్కర్స్, అంగన్‌వాడీ, ఆశ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యావరణ పరిరక్షణపై జనసేన అవగాహన కార్యక్రమం

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త : మండలంలోని కొత్త కోడూరు బీచ్ వద్ద ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమ న్వయ నేత బొబ్బేపల్లి సురేష్ నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ వాణి భవాని నాయుడు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ సముద్ర తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిళ్లు, డైపర్లు పడేయడం వల్ల పరిసర జలాలు కలుషితమై పర్యావరణానికి తీవ్ర భంగం కలుగుతుందని తెలిపారు. తీరం వద్ద ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లను తప్పనిసరిగా వినియోగించాలని కోరారు. అలాగే నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలవుతుండటం వల్ల కుటుంబాలు చెల్లాచెదరవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తమ పిల్లలను క్రమశిక్షణలో పెంచి సమాజానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సందూరు శ్రీహరి, పామంజి శ్రావణ్, కొండూరు విజయ్‌కుమార్, గద్దె వెంకయ్య, నన్నం మహేష్, మంగపతి వంశీ సాయి తదితరులు పాల్గొన్నారు.

సమరసతకు ప్రతీక సంత్ రవిదాస్ - శ్రీనివాసమూర్తి

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

సామాజిక సంస్కర్త, సమతామూర్తి సంత్ రవిదాస్ అని నెల్లూరు జిల్లా ధర్మాచార్య ప్రముఖ శ్రీనివాసమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక అరుంధతివాడలో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ రవిదాస్ 650వ జయంతి వేడుకలు తోటపల్లి గూడూరు సమరసత వేదిక అధ్యక్షులు రాధాకృష్ణయ్య అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ భగవంతునికి కులమతాల భేదం లేదని సమాజానికి చాటి చెప్పిన మహానుభావుడు సంత్ రవిదాస్ అని పేర్కొన్నారు. చెప్పులు కుట్టే వృత్తిలో ఉన్నప్పటికీ గంగామాత అనుగ్రహంతో దైవ కృప పొందిన రవిదాస్‌కు భగవంతునిపై అపార విశ్వాసం ఉందని, అది ఆయన కవిత్వంలో ప్రతిబింబిస్తుందని తెలిపారు. కుల వివక్షత సమాజానికి క్షేమకరం కాదని ఆచరణలో నిరూపించిన వ్యక్తి సంత్ రవిదాస్ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోళ్ళ కేశవులు మాట్లాడుతూ రవిదాస్ భక్తి ఉద్యమానికి మణికిరీటమని, ఆయన ఆదర్శాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డుభద్రత,హెల్మెట్ ప్రాధాన్యతపై అవగాహన

ఆత్మకూరు,ఫిబ్రవరి8,ప్రభాతవార్త:

రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాధాన్యత, ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం ఆత్మకూరు ఎస్ఐ జిలానీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల కారణంగా అనేకమంది మృతి చెందడమే కాక కొందరు తీవ్రమైన గాయాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యంవలన కూడా కుటుంబాలు రోడ్డుమీదపడే పరిస్థితి ఏర్పడుతుందని కావున ప్రజలు రోడ్డు భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత్ వేజెండ్ల గారి ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి కె.వేణుగోపాల్ మార్గదర్శకత్వంలో ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.గంగాధర్ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నేషనల్ హైవేపై ఉదయం, సాయంత్రం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు పోలీస్ సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా పూజారికి అందని జీతం

కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కోట మండలం గూడలి కొండపై వెలసిన భీమేశ్వరస్వామి ఆలయ పూజారి సుబ్రహ్మణ్య స్వామికి గత ఆరు నెలలుగా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శివరాత్రి ఉత్సవాలపై ఆయనను 'ప్రభాతవార్త' అడగగా ఆలయంలో జరిగే పనులు పక్కన పెడితే, తనకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. నిత్యం కొండపైకి వచ్చి తాను స్వామి వారికి నైవేద్యాలు సమర్పిస్తున్నానని పేర్కొన్నారు. ఇదే విషయమై ఆలయ ఇఓ కెవిపి ప్రసాద్‌ను 'ప్రభాతవార్త' అడగ్గా తాను వచ్చి నాలుగు నెలలు అవుతున్నా తనకు కనీసం ఆలయ పూజారి కలవలేదన్నారు. తన వద్ద చెక్కుబుక్ ఎప్పుడూ ఉంటుందని, బ్యాంకులో డబ్బులున్నాయని, తనను కలిస్తే చెక్కు రాసి ఇస్తానని తెలిపారు.

కొడవలూరు వ్యవసాయ భవనంకు మోక్షం ఎప్పుడు.?

కొడవలూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలో వేల ఎకరాల సాగుభూమి, వందల సంఖ్యలో రైతులు ఉన్నప్పటికీ వాళ్లకి అవసరమయ్యే వ్యవసాయ కార్యాలయం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గతంలో వ్యవసాయ భవనం అని పేరుతో నిర్మించిన భవనాన్ని వ్యవసాయ అధికారులకు అప్పగించకుండా గాలికి వదిలేశారు. ఆ భవనం కంప చెట్లతో నిండిపోయి మందుబాబులకు నిలయంగా మారింది.ఈ వ్యవసాయ భవనం అభివృద్ధి పరచాలని అధికారులు కొంతకాలం క్రితం పరిపాలకుల దృష్టికి తీసుకెళ్లగా,5 లక్షలతో భవనం అభివృద్ధి చేయించడం జరుగుతుందని వాగ్దానం చేశారు.ఇప్పటివరకు వాగ్దానం నెరవేరలేదు భవనం మాత్రం శిథిలావస్థకు చేరుకుంటుందని రైతన్నలు వాపోయారు. ఈ వ్యవసాయ భవనం ఎందుకు వినియోగంలోకి రాలేదు అనే విషయంపై జిల్లా అధికారులు ఆరాదీసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

గండవరం కాలేశ్వర స్వామి అంగళ్లు వేలం జరిగిందా.? వేలం పాట ఎంత వరకు సాగింది హుండీ, అంగళ్ల వేలంపాట ఆదాయం ఎంత

కొడవలూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలోని గండవరం గ్రామంలో వెలసియున్న శ్రీ ఉదయ కాళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రతి ఏడాది జరుగుతాయి. పరిసర ప్రాంతాల నుండి ప్రజలు మహాశివరాత్రి సందర్భంగా వేల సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించు కుం టారు. మొక్కలు తీర్చుకునే భక్తులు వారికి తోచిన విధంగా స్వామి వారి హుండీలో కానుకులను సమర్పి స్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముందుగా హుండీలో వచ్చిన కానుకులను దేవదాయ శాఖ అధికా రుల, పాలక మండల సభ్యులు, ప్రజానికం, చైర్మన్ ఆధ్వర్యంలో లెక్కింపు జరిపి ఆదాయాన్ని బహిరం గంగా వెల్లడించాలి. అలాగే బ్రహ్మోత్సవాలకు ఆలయం ఆవరణంలో వివిధ రకాల అంగళ్లు ఏర్పాటుకు వేలంపాట పైన తెలిపిన విధంగా వారి సమక్షంలో నిర్వహించాలి. ఒకవేళ వేలంపాట జరిగి ఉంటే ఎంత వరకు సాగి ముగిసింది.వచ్చిన హుండీ, వేలం పాట ఆదాయాన్ని ఎందుకు ఉపయోగిస్తారో సంబంధిత అధికారులు బహిరంగంగా వెల్లడించాల్సి ఉండగా, ఈ ఆలయంలో ఏమి జరిగినా గోప్యంగానే జరుగు తుందని ప్రజల్లో చర్చలు మొదలయినాయి.ఇకనైనా జిల్లా ఉన్నత అధికారులు ఆలయంలో జరిగిన విషయా లను సమగ్ర విచారణ చేపట్టితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి తద్వారా ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏకీకృత సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

కొడవలూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలోని యల్లయపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏకీకృతం కుటుంబ సర్వే ను స్థానిక ఎంపీడీవో వెంకట సుబ్బారావు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రజలతో మాట్లాడుతూ ఈ సర్వేవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబంలో ఆధార్,రేషన్ కార్డులు లేకపోయినా, ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు అందకపోయినా ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి తెలుస్తుంది. ప్రతి ఒక్కరు ఈ సర్వే ద్వారా వివరాలను నమోదు చేసుకుంటే ప్రభుత్వ నుండి రావాల్సిన పథకాలు రావడం జరుగుతుందని ప్రజలకు వివరించి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యులు గరికపాటి రాజేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో శ్యాంసుందర్, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున్, నాగ శివతేజ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నూతన హెల్త్ సెంటర్ కు భూమి పూజ

కొడవలూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

మండలంలోని గుండాలమ్మ పాలెం గ్రామంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నూతన హెల్త్ సెంటర్ మంజూరు చేయడం జరిగిందని కోవూరు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు పల్లం రెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. నూతన హెల్త్ సెంటర్ భవనానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రజలకు ఏమి అవసరమో తెలుసుకొని పరిష్కారం చేసే పరిపాలికులు ఉన్నారంటే ఒక కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అని పల్లం రెడ్డి సురేష్ రెడ్డి కొనియాడారు.గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ విఆర్ఓ బాబు, సిద్ధారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి, దేగ శ్రీహరి రావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు పట్టించుకోరా.?

విడవలూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త :

విడవలూరు నుండి పార్లపల్లి, రాళ్లమిట్టగ్రామం వరకు ఇరువైపుల ఉన్న విద్యుత్ స్తంభాలు త్రీఫేస్ పేరుతో అలంకారప్రాయంగా దర్శన మిస్తు న్నాయి. ఇదిలా ఉంటే విడవలూరు నుండి సబ్ స్టేషన్ కు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలు స్తంభం నుండి క్రిందకు జారిపోయి ప్రమాదకరంగా ఏర్ప డ్డాయి. తీగలను పిచ్చి మొక్కలు అల్లుకుపోయి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నా యి.అటుగా వెళ్లే రైతులు ప్రాణాల వారి చేతిలో పెట్టుకుని వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదేనా కరంటోళ్ల ప్రజా దిన కార్యక్రమం అని ప్రజల్లో చర్చలు జోరుగా మొదలై నాయి.ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నూరుశాతం వసూళ్లు ధ్యేయంగా పనిచేయాలి

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీల్లో ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూళ్లను ఫిబ్రవరి 15 నాటికి నూరుశాతం వసూలు చేసేలా సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వసుమతి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఆమె ఇన్‌చార్జి ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, కార్యదర్శులతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దుకాణాలు సంబంధించి పన్నులు కూడా వేగవంతం కావాలన్నారు. ఇందుకు ప్రజలు వ్యాపారస్తులు కూడా పూర్తిస్థాయిలో సహకరించి సకాలంలో పన్నులు పంచాయతీకి కట్టేలా సహకరించాలన్నారు.

వేగవంతంగా పెట్రోల్ బంక్ పనులు

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

కోవూరులోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంతంలో పోలీస్ శాఖ ద్వారా నిర్మాణం కానున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సైతం ఈ ప్రాంతంలో ఉన్నపాత నిర్మాణాలను జేసీబీ ద్వారా తొలగించే కార్యక్రమాన్ని యుద్ధప్రాతి పదికన చేపడుతున్నారు. త్వరలో ఈ పెట్రోల్ బంక్ పనులకు సంబంధించి శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయని పోలీస్ శాఖ అధికారులు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన ఫాగింగ్

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

కోవూరు పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు దోమల నివారణకు గానూ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమం కొనసాగుతుంది. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయా ప్రాంతాలకు సంబంధించిన నాయకులు దగ్గరుండి ఫాగింగ్ కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్నారు.

తహసీల్దార్ సుబ్బయ్యకు పరామర్శ

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

కోవూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న సీహెచ్ సుబ్బయ్య సతీమణి స్వాతి ఇటీవల మృతిచెందడం విధితమే. ఈ మేరకు ఆదివారం ఇనమడుగు గ్రామానికి చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ అధినేత గండవరపు వసంత్‌కుమార్‌రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు పొన్నవోలు సుధీర్‌రెడ్డి తదితరులు తహసీల్దార్ ఇంటికి వెళ్లి స్వాతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుబ్బయ్యను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు.

సమాజంలో కలిసిపోవాలి

కోవూరు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :

కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీలుగా, కేడీలుగా అనుమా నితులుగా రికార్డులకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సన్మార్గంలో పయనించాలని కోవూరు ఎస్సై ముత్యాలరావు అన్నారు. కోవూరులోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీమేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధంగా రికార్డులకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సభ్య సమాజంలో కలిసిపోవాలన్నారు సత్ప్రవర్తనతో ముందుకు సాగితే మీ భవిష్యత్తు బాగుంటుందన్నారు. మారకపోతే మీ పరిస్థితి ఇంతేనని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఆశ్రమానికి నిత్యావసరాల వితరణ

నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త-విద్య : శిరిగిరెడ్డి అనిత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని స్థానిక వనంతోపు సెంటర్‌లోని జనహి తవాత్సల్య చిన్నారుల, వృద్ధుల ఆశ్రమా నికి నిత్యావసర సరుకులను వితరణ చేశారు. ఆశ్రమ నిర్వహణ కార్యదర్శి సాం బశివరావు ఈ నిత్యావసరాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఏపిహ ంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్‌రవు మాట్లాడు తు యూకేలో నర్సింగ్ అధికారిగా సేవలు అందిస్తూ ఆమే జన్మదినోత్సవం సందర్భంగా నేడు వాత్స ల్యఆశ్రమంలో పిల్లలకు, పెద్దలకు అవసరమైయ్యే నిత్యావసారలను వితరణ చేయటం గర్వకారణమన్నారు. నిత్యావసర సరుకులు అందించటంతో పాటూ ఆశ్రమంలోని చిన్నారుల ఉన్నతికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలుపటం స్ఫూర్తి దాయకమని కొనియాడారు. గతంలో ఏపీ కమ్యునిటీ హెల్త్ అధికారిగా , అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా కూడా ఉన్నతంగా అనిత వ్యవహరి ంచారని, ఆమేని సేవామార్గం వెపు ప్రోత్సహిస్తున్న ఆమే భర్త భరత్ కూడా ఆదర్శప్రాయులన్నారు. ఈ కార్యక్రమంలో సేవా టీం నిర్వాహకులు అరవ పరిమళ, విజయమ్మ, లక్ష్మీకాంతమ్మ, మంజరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసుల ప్రత్యేక తనిఖీలు

నెల్లూరు క్రైమ్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు సిబ్బంది వాహనాలు లాడ్జిలను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు శనివారం రాత్రి 9 నుండి 11 గంటల వరకు వాహనాలు, అదేవిధంగా లాడ్జీలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి, అక్కడ పరిస్థితులను స్థానిక పోలీసులు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 82 లాడ్జీలను తనిఖీ చేసారు. అదే విధంగా 1839 వాహనాలు తనిఖీ చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ 19, ఓపెన్ డ్రింకింగ్ 21, ఎంవి యాక్ట్ కేసులు 116 నమోదు చేసి రూ.93,160 ఫైన్ విధించారు. జిల్లాలో అన్ని కూడళ్ళు, హైవే, ప్రవేశం, నిష్క్రమణ ప్రాంతాలలో విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫ

ఇస్కపల్లిలో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ

అల్లూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లి పంచాయితీ కార్యాలయం నందు ఆదివారం పెన్నాడెల్టా వైస్‌ఛైర్మెన్ బీద గిరిధర్, తహశీల్దార్ లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియ గ్రామంలో పూర్తయిన సందర్భంగా రాజముద్రతో కూడిన 878 పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. బీద గిరిధర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియ ద్వారా రైతులకు భూమి హక్కులపై చట్టపరమైన భద్రత లభిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పొలిశెట్టి పాపన బోయిన రత్తయ్య, బండి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ రంజిత్‌కుమార్, రైతులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేద్దాం
జనసేన మండల అధ్యక్షులు మాదవ్

బుచ్చి ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని మినగల్లు గ్రామంలో జనసేన గ్రామ కమీటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు మాదవ్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన జనసేన సైనికులతో ఆయన మాట్లాడారు, ప్రతి గ్రామంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు అందరు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మినగల్లులో గతంలో కంటే ఎక్కువ సభ్యత్వాలు జరిగేలా చూడాలని అన్నారు. అలాగే గ్రామం అభివృద్ధిలో జనసేన పాత్ర ఉండాలని, పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని చెప్పారు. గ్రామంలో సమస్యలు తెలుసుకొని ప్రజలకు మరింత చేరువయ్యేలా ఉండాలని అన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు మండల నాయకత్వాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదవ్, జనసైనికులు గోవర్ధన్, నాగరాజు, యశ్వంత్, వెంకయ్య, బార్గవ్, వెంకటేష్, మండల జనసైనికులు పసుపులేటి సురేష్, తుమ్మల ప్రసాద్, బిట్రాసాయి, మనోజ్ పాల్గొన్నారు.

కంచర్ల మధును పరామర్శించిన ఎమ్మెల్యే

కావలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కావలి 20వ వార్డుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కంచర్ల మధుసూదన్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందర్భంగా విషయం తెలుసుకొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి స్థానిక కచ్చేరి మిట్టలోని వారి నివాసానికి చేరుకొని ఆయనను పరామర్శించారు. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకొన్నారు. వైద్యుల సూచనల పాటిస్తూ జాత్రగత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరివీధి ప్రసాద్, పాలదుగు మురళి, కావేటి చిన్న కోటయ్య, రాయపాటి దిలీప్‌కుమార్‌లు ఉన్నారు.

ఏపీజీఈఏ నెల్లూరు సిటీ తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : నెల్లూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం నెల్లూరు నందు ఆదివారం ఏపీ జీఈఏ నెల్లూరు సిటీ కార్యవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా వై దినేష్ రెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా ఎన్ చంద్రశేఖర్ వ్యవహరించిన ఈ ఎన్నికలలో నెల్లూరు సిటీ తాలూకా యూనిట్ అధ్యక్షులుగా బి కిరణ్ కుమార్, కార్యదర్శిగా వి. పనింద్ర బాబు ఎన్నికయ్యారు. నెల్లూరు సిటీ తాలూకా యూనిట్ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ ఎన్నికలలో సహాధ్యక్షులుగా డాక్టర్ ఎం శ్రావణ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి శైలేంద్ర కుమార్, కోశాధికారిగా రెహమాన్‌లు ఎన్నిక కాగా వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వోద్యోగులు కే వరప్రసాద్, ఎస్‌బి భవాని సిఎస్ షఫీ ఉల్లా, డాక్టర్ బి.వి.సుబ్బయ్య, ఎమ్. దాక్షాయిని, ఉమా, యు శ్రీధర్‌లు ఉపాధ్యక్షులుగా, వి పద్మావతి, జి వెంకటేశ్వర్లు, కే రాజ్యలక్ష్మి, ఈ. వీరేంద్ర, పిఎస్కే చక్రవర్తి, పి గోపాలకృష్ణ, జీవీ సునీల్ సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏపిజిఈఏ జిల్లా అధ్యక్షులు బి సుధాకరరెడ్డి కార్యదర్శి పివిఎస్‌టి రాంప్రసాద్‌లు అభినందించారు.

విజ్ఞాన యాత్రలు విద్యార్థులకు ఉపయోగకరం

కోవూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : విజ్ఞాన విహార యాత్రల వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ వై. నందకిషోర్ తెలిపారు. ఈ మేరకు విజ్ఞాన యాత్రలో భాగంగా కృష్ణపట్నం పోర్టును విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టులోని అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోర్టు ద్వారా ఏయే వస్తువులు దిగుమతి అవుతున్నాయి. ఏయే వస్తువులు ఎగుమతి అవుతున్నాయి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రాణాలతో బయటపడిన 12 మంది మత్స్యకారులు

కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కోట మండలం గోవిందపల్లిపాలెంకు చెందిన ఐదుగురు, విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన ముగ్గురు, పొన్నపూడి గ్రామానికి చెందిన నలుగురు మొత్తం 12 మంది మత్స్యకారులు బోటులో రెండురోజుల క్రితం చేపల వేటకు సముద్రంలో తమిళనాడు వైపు వెళ్లారు. సముద్ర తీర ప్రాంతంలో వారి షిపింగ్ బోట్ అలల ఉధృతికి మునిగి పోయింది. కొంతమంది మత్స్యకారులు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని ఇంటికి చేరుకున్నారు. మరికొంతమందిని తమిళనాడు మత్స్యకారులు రక్షించి బోటును వెలికి తీసే ప్రయత్నాలు చేస్తున్నారు. 12 మంది మత్స్యకారులు బయటపడ్డారని పెదకాపు మస్తానయ్య తెలిపారు.

టిడిపిలో ఎవరికి వారే యమునా తీరే

తెలుగుదేశం పార్టీ

– వైసిపిలో నిస్తేజం –
నలిగిపోతున్న కార్యకర్తలు

కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కోట మండల తెలుగుదేశం పార్టీలో వర్గపోరు పతాక స్థాయికి చేరుకుంది. ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీలో రెండు వర్గాలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఒకవర్గంలోని సీనియర్ నాయకులంతా బాలసదన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవర్గం నాయకులు షాదీమంజిల్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అంతా ఒకేతాటిపై నడుస్తూ వచ్చింది. అనంతరం కోట మండల టిడిపి అధ్యక్ష పదవి ఎంపికలో ఒక వర్గం పైచేయి సాధించి, మరో వర్గం కీలక నాయకుడికి ఆ పదవి రానివ్వకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పార్టీలో రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీ ఆదేశిస్తే కార్యక్రమాలను ఒకవర్గం నాయకులు మాత్రమే ముందుకు నడిపిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని మాజీమంత్రి అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కోట గాంధీబొమ్మ సెంటర్లో ఒక వర్గం మాత్రమే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వర్గ విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని వైసీపీ ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వైసీపీలో కూడా క్యాడర్ అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. కోటలో టిడిపికి ధీటైన నాయకులు వైసీపీలో లేరని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ జయంతి, వర్ధంతి, జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మాత్రమే వైసీపీ క్యాడర్ కనిపిస్తోందని, ఆ తర్వాత కనిపించడం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.

అన్నారెడ్డిపాళెంలో విలేజ్ రీసర్వే

సంగం ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో రిసర్వే డిటి పి.బ్రహ్మయ్య రీసర్వే విలేజ్ పాసు బుక్‌లు వెరిఫికేషన్ చేశారు. వెరిఫికేషన్ అనంతరం మండల, జిల్లా అధికారులు పరిశీలించిన తరువాత పాసు బుక్‌లు వస్తాయని తెలిపారు. వెరిఫికేషన్‌లో తప్పులు లేకుండా సవరణలు చేయడం జరుగ ఎతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పలువురుకి బయెమెట్రిక్ తీశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సల్మా, విఆర్ఒ కుమార్, విఆర్ఒ వెంగయ్య, గ్రామ సర్వేయర్ సుదర్శన్, రైతులు గ్రామ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు మైనర్ బాలిక మృతి ఘటనపై లోతైన దర్యాప్తు జరపాలి

- గంజాయి బ్యాచ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి
- గంజాయి కారణంగా జరుగుతున్న ఘటనలపై హోంమంత్రి ప్రకటన చేయకపోవడం విచారకరం
- గంజాయి మూకల వల్ల చనిపోయిన మైనర్ బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ప్రజా సంఘాల డిమాండ్

నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : కోవూరు గుమ్మళ్లదిబ్బలో మైనర్ బాలిక మృతి ఘటనపై పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బి డిమాండ్ చేశారు. ఆదివారం నెల్లూరులోని రామచంద్రారెడ్డి భవన్‌లో బాలిక మృతి ఘటనపై ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ ప్రజా సంఘాల నేతలు విలేకర్ల సమావేశం నిర్వహించారు. జనవరి 30వ తేదీ కోవూరు గుమ్మళ్లదిబ్బ కత్తకాలనీలో గంజాయి మత్తుకు బానిసైన యువకులు మైనర్ బాలికను తీసుకెళ్లిన ఘటనలో ఆ బాలిక శుక్రవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ చనిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మస్తాన్‌బి మాట్లాడుతూ ప్రభుత్వం గంజాయి సరఫరాను అరికట్టడంలో విఫలమైందన్నారు. కేవలం హామీల వరకే పరిమితమైన విషయం కోవూరు ఘటన స్పష్టం చేస్తుందన్నారు. పోలీసులు బాలిక మృతిపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన మైనర్ బాలికకు సరైన చికిత్స అందించడంలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అనంతరం ఆవాజ్ నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఉండాల్సిన పల్లెలు డ్రగ్స్ మత్తులో జోగుతున్నాయని గంజాయి, వైట్నర్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలు కావడం బాధాకరమన్నారు. పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టి అసాంఘిక శక్తులను అణిచివేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు కూడా ఇటువంటి అలవాట్లు ఉన్న వారిని దూరం పెట్టాలని కోరారు. నెల్లూరు జిల్లాలో గంజాయి కారణంగా జరుగుతున్న ఘటనలపై హోంమంత్రి ఒక స్పష్టమైన ప్రకటన చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో రాబోయే రోజుల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా అరికట్టేందుకు పోలీసులకు తగిన స్వేచ్ఛ ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎంవీ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరేంద్ర, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు కత్తి పద్మ, శంషాద్, వరలక్ష్మీ, సుబ్బమ్మ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బీపీ నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు సురేంద్ర, రాజేష్, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యజ్ఞేష్, అమర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కొవ్వొత్తులతో నివాళి: గంజాయి మూకల చేతిలో బలైన మైనర్ బాలికకు నివాళిగా రేపు జిల్లాలోని మండల కేంద్రాల్లో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టాలని ఐద్వా, డీవైఎఫ్ఐ, ఆవాజ్, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల కమిటీలు తీర్మానించాయి. గంజాయికి వ్యతిరేకంగా రేపు జరిగే కొవ్వొత్తుల నివాళి కార్యక్రమంలో స్థానిక ప్రజలు కూడా పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కృష్ణ రివర్ క్రాస్ పోటీల్లో కోర్టు ఉద్యోగి ప్రతిభ

కోవూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతిలోని ఉండవల్లి ప్రాంతంలో ఆదివారం 26వ కృష్ణ రివర్ క్రాస్ 1.5 కిలోమీటర్ ఈత పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కోవూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నెల్లిపూడి శ్రీనివాసులు పాల్గొని 1.5 కిలోమీటర్ల ఈత పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచి నిర్వాహకుల చేతుల మీదుగా పతకం, సర్టిఫికెట్‌ను పొందారు. ఈ సందర్భంగా ఆయనను కోర్టు సహచర ఉద్యోగులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

యువత గంజాయికి బానిసలు కావద్దు

కోవూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కోవూరు పంచాయతీ పరిధిలోని కొత్త కాలనీ ప్రాంతంలో ఇటీవల దుశ్చర్యలకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన మైనర్ బాలిక మృతదేహాన్ని ఆదివారం ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చి వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా పోలీస్ శాఖ పెట్రోలింగ్ పెంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యువత ఇటువంటిమత్తు పదార్థాలకు బానిలసలుగా మారి ఒళ్లు తెలియకుండా ప్రవర్తిస్తే వారి భవిష్యత్తు పూర్తిగా అంధకారం అవుతుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు సమాజంలో తమ బిడ్డలు ఏ విధంగా ఉన్నారో గమనించాలని కోరారు. చట్టం ఎవరిని వదిలిపెట్టదని, ఇది మరొకరికి గుణపాఠం అయ్యేలా కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టమన్నారు. బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీడీపీ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కుటుంబ బిడ్డను పోగొట్టుకుని క్షోభకు గురైందని, ఇటువంటి సమయంలో మేమున్నామని భరోసా ఇవ్వాలే తప్ప దానిని కూడా రాజకీయం చేయకూడదని హితవు చెప్పారు. దీనిపై దుష్ప్రచారం చేసిన కొందరిపై కూడా పోలీస్ శాఖ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడి తామున్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు రియాజ్, సాబీర్ ఖాన్, ఇంతియాజ్, మసూద్, జహంగీర్, పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి ఆనంతో మంత్రి నారాయణ భేటీ



నెల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త–విద్య : ఆదివారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఆయన నివాసంలో రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ మర్యాదపూర్వకంగా కలసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణను మంత్రి ఆనం ఆత్మీయంగా పకలరించి సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. అనంతరం జిల్లాతో పాటూ నగరంలో నిర్జీవంగా ఉన్న దేవాలయాల పునఃనిర్మాణం, ఆలయాల్లో నూతన పాలక మండలిల ఏర్పాట్లు, ఆలయాల నిర్వహణ, జిల్లాలో పార్టీ స్థితిగతులు, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఈనెల 11నుండి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏఏ సమస్యలపై మాట్లాడాలి అనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పోరేషన్ ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తెలుగుదేశం నాయకులు, కిమ్స్ హాస్పిటల్స్ అధినేత బోల్లినేని గిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నగర్ మేయర్‌ను(ఎరుకుల) వారికి ఇవ్వాలి
ఎరుకుల సేవాసంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ్ల శివ డిమాండ్

నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్థానం ఎరుకుల వారికే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అధ్యక్షులు నల్లగొండ శివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వనంతోపు సెంటర్ వద్ద ఎరుకల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర మేయర్ గిరిజనుల హక్కు అని అన్నారు. భారత రిజర్వేషన్ హక్కు చటాటలు, గిరిజన రక్షణ చట్టాలు, కేంద్ర రాష్ట్ర మున్సిపల్ చట్టాలు ప్రకారంగా గిరిజనులకు ఐదు సంవతసరాల రిజర్వేషన్ పరంగా వచ్చిన పదవిని అనివార్య కారణాల వల్ల ఐదు సంవత్సరాలు కాకుండానే రాజీనామా చేస్తే మిగిలిన కాలాన్ని అదే గిరిజన వాళ్ళకే ఇవ్వాలని తెలిపారు. గత మేయర్ తన రాజీనామా లేఖను కలెక్టర్‌కు ఇచ్చి దాదాపు 40రోజుల కావస్తున్నా ఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీ చేయలేదన్నారు. కొత్త నోటిఫికేషన్ జారీ చేసి రిజర్వేషన్ పరంగా గిరిజన ప్రజానేతకు మేయర్ పదవి ఇవ్వాల్సిందిగా ఎరుకల జేఏసి సంఘాల ద్వారా డిమాండ్ చేస్తున్నామన్నారు. దళిత గిరిజనులు ఐక్యమై ఉద్యమిస్తామని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కేంద్ర మానవ హక్కుల కమిషన్, గిరిజన సంక్షేమశాఖ కమిషన్ ఛైర్మెన్, గవర్నర్ కలసి నెల్లూరులో జరిగే అరాచక మేయర్ పాలకపై ఫిర్యాదు చేస్తామని రానున్న రోజుల్లో మా ఎరుకల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఛైర్మెన్ కట్టా రామారావు, జిల్లా వైస్ ఛైర్మెన్ కట్ట రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొండ్ల వెంకయ్య, జిల్లా జాయింట్‌సెక్రటరీ కంప శ్యామ్, జిల్లా ఉపాధ్యక్షులు కట్ట పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

మలినమైన మేయర్ కుర్చీకి శుద్ధి

- గిరిజనులకు కేటాయించిన ఆ సీటుపై గిరిజనేతరులు ఎలా కూర్చోపెడుతారు
- రాజ్యాంగ విరుద్ధంగా దళితులపై ప్రభుత్వ కుట్ర – రాష్ట్రస్థాయి ఉద్యమానికి సిద్ధంగా ఉన్నాం
- గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేధిక రాష్ట్ర అధ్యక్షుడు బావట్ల వెంకటపతి

నెల్లూరు కార్పోరేషన్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ప్రభుత్వం గిరిజనుల చట్టాలు హక్కులను కాలరాస్తోందని గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేధిక రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి మండిపడ్డారు. నెల్లూరు కార్పోరేషన్ మేయర్ పీఠాన్ని గిరిజనులకు కేటాయిస్తే గిరిజనేతరులను ఎలా కూర్చబెడుతారని ఆయన ప్రశ్నించారు. అందుకే ఈ సీటు మలినమైందని అన్నారు. ఆదివారం స్థానిక బట్వాడిపాలెం సెంటర్ నుండి స్వర్ణాల చెరువు వరకు మేయర్ కుర్చీని ఊరేగిస్తూ స్వర్ణాల చెరువులో శుద్ధి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నెల్లూరు మేయర్ సీటును గిరిజనులకు కేటాయించడం జరిగిందన్నారు. ఒర్వలేక మాజీ మేయర్ పొట్లూరి ప్రవంతిని అర్ధాంతరంగా అవిశ్వాస తీర్మాణం పెట్టి అమెను సీటు నుంచి దించడం కోసం ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అవిశ్వసం వద్దు అని ఆమె స్వయంగా రాజీనామా చేశారు. మేయర్‌కు సంబంధించి మిగిలిన కాలాన్ని మరో గిరిజన మహిళలకు ఆ సీటును కేటాయించకుండా బీసీలను ఆ సీటులో కూర్చోబెట్టడం దారుణమన్నారు. ఇదేనా ప్రభుత్వానికి గిరిజనుల పట్ల ఉన్న చిత్తశుద్ధి అంటూ ఆయన దుయ్యబట్టారు. ఎస్టీ గిరిజనులకు బారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాన్ని ఇంతటితో వదలమని ఆవసరమైతే దేశ స్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఆయన హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మేయర్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్యవేధిక తరపున బత్తుల లక్ష్మణశేఖర్ చౌటూరి శ్రీనివాసులు తాళ్ళ ఏడుకొండలు, ఎందేటి సురేంద్ర, చేవూరు శ్రీనివాసులు, గిరిజన ప్రజలు పాల్గొనడం జరిగింది.

యూనిఫైడ్ సర్వే వేగవంతం కావాలి

కోవూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నిగామాల్లో జరుగుతున్న యూనిఫైడ్ సర్వేను మరింత వేగవంతం చేసేలా సచివాలయ ఉద్యోగులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ మేరకు ఆమె పడుగుపాడు పంచాయతీల, నేతాజీనగర్‌లో జరుగుతున్న యూనిఫైడ్ సర్వేను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ సర్వే కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు ప్రజలు పూర్తిస్థాయిలో సచివాలయ సిబ్బందికి సహకరించి సమాచారాన్ని అందజేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు కూడా ఈ సర్వేను మరింత వేగవంతం చేసి సకాంలో పూర్తిచేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు.

జ్ఞానజ్యోతి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త –విద్య : ఆదివారం పుత్తూరులో నిర్వహించిన జ్ఞానజ్యోతి విద్యాసంస్థల వార్షికోత్స వేడుకల్లో ముఖ్యఅతిథిగా తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాజీ మంత్రి ఆర్‌కే.రోజాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు విద్యాసంస్థల గురించి , నిర్వాహకుల విలువల గురించి చాలామంది చెప్పారని, నేడు ప్రత్యక్ష్యంగా వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉన్నత శికరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, సమాజంపట్ల గౌరవభావంతో మెలగాలని, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం విద్యాసంస్థల అధినేతలు హరినాథరెడ్డి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ విశ్వనాథ్‌రెడ్డి, జ్ఞానజ్యోతి విద్యా సంస్థల అద్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం



వింజమూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : సీతారాంపురం పోలీసు స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివార